
# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
10 నిజామాబాద్, శుక్రవారం 20 జూన్ 2025 KAMAREDDY


## నిజాంసాగర్‌కు ప్రాణప్రతిష్ట..

నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు. 2.30 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్టే ఆధారం. కొన్నేళ్లుగా ఎగువ నుంచి వరద లేక నిజాంసాగర్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వానాకాలం ప్రారంభ సమయానికి నీళ్లు లేక ఆయకట్టు రైతులను ఆదుకోవడం కష్టంగా మారింది. వానాకాలం ముగింపులో కురిసే భారీ వర్షాలకు గడిచిన నాలుగేళ్ల పాటు నిజాంసాగర్ గేట్లు వరుసగా ఎత్తుతున్నప్పటికీ, సమయానికి సాగు నీళ్లు అందించే అవకాశం లేదు. ఈ సమస్యకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుతో చెక్ పెట్టారు. మేడిగడ్డ నుంచి గోదావరి జలాలను ఎల్లంపల్లి, మిడ్ మానేరుకు తరలించి, అక్కడి నుంచి 25 కిలో మీటర్ల సొరంగ మార్గం ద్వారా సిద్దిపేట జిల్లా సరిహద్దులోని అనంతగిరి రిజర్వాయర్ మీదుగా శ్రీరంగనాయకసాగర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఆ తర్వాత మల్లన్నసాగర్ మీదుగా కొండపోచమ్మసాగర్‌కు తరలించి ప్యాకేజీ 18లో భాగమైన హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్‌కు కాళేశ్వరం జలాలు తరలిస్తున్నారు. ఎక్కడో ఉన్న గోదావరిని తీసుకొచ్చి నిజాంసాగర్ ఆయకట్టు రైతుల్లో కేసీఆర్ ఆనందం నింపారు. సింగూరు జలాలతో సంబంధం లేకుండానే నిజాంసాగర్‌కు ప్రాణ ప్రతిష్ట చేశారు. 2021 ఏప్రిల్ 22న కాళేశ్వరం జలాలు తొలిసారి నిజాంసాగర్‌కు తరలొచ్చాయి.



ఎమ్మెల్సీ కవిత అందజేసిన వినతిపత్రాన్ని చదువుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఖలీల్‌వాడి, జూన్ 19 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. బంజారా పీఠాధిపతులతో కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో హైదరాబాద్‌లో గురువారం భేటీ అయ్యారు. తిరుపతిలోని హథీరాం భావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించడంతోపాటు నైవేద్యం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. త్వరలోనే హథీరాం భావాజీ మఠం నిర్వాహకులు, గిరిజ పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ హామీ ఇచ్చారు. మఠంలో పూజలు చేయడానికి హారతినివ్వడానికి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 30న హథీరాం భావాజీ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడానికి, నైవేద్యం సమర్పించడానికి అవకాశం కల్పిస్తామని హామీనిచ్చారు.

రివర్స్ పంపింగ్‌లో భాగంగా ఎస్సారెస్పీలోకి చేరుతున్న కాళేశ్వరం జలాలు



- రెండు పంటలకు నీళ్లిచ్చేలా ప్రాజెక్టులు
- నిజాంసాగర్ ప్రాజెక్టుకు కొండపోచమ్మ జలాలు
- రివర్స్ పంపింగ్‌తో శ్రీరాంసాగర్‌కు ప్రాణప్రతిష్ట
- బోసిపోయిన వరద కాలువకు పూర్వ వైభవం
- జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టు వార్షికోత్సవం

# సుజలకేతనం.. కాళేశ్వరం


## ఉమ్మడి జిల్లాకు కేసీఆర్ జలాభిషేకం

**దశాబ్దాలుగా** సాగునీటికి గోసపడ్డ రైతాంగం. తలాపున గోదావరి.. పంట చేలన్నీ ఎడారిగా మారిన దౌర్భాగ్యం. పల్లెపల్లెన కరువు రక్కసి విలయ కోరలు చాచిన దుస్థితి. పొట్ట చేత పట్టుకుని ఎడారి దేశాలకు వలస పోయిన పరిస్థితి. ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైన బతుకులు.. ఉన్న భూమిని, కన్న ఊరిని వదిలిపోయిన కుటుంబాలు.. అయితే, దశబ్దాల క'న్నీటి గోస'కు తెరపడింది తెలంగాణ సిద్ధించాకే. బీడు వారిన పొలాల్లో గోదావరి పరవళ్లు తొక్కింది బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినాకే. సాగునీటి తిప్పలు తప్పిస్తూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్ర పుటల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. గోదావరిని ఎదురెక్కించి బంజరు భూముల్లో 'జల' కేతనం ఎగురవేశారు. 'కాళేశ్వరం'తో తెలంగాణకు జలాభిషేకం చేసిన అభినవ భగీరథుడు చంద్రశేఖరుడు.. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు ప్రాణప్రతిష్ట చేశారు. ఒక్క పంట పండడమే కష్టమైన దుస్థితి నుంచి ఏటా రెండు పంటలు సాగయ్యేలా చేశారు. బీడు వారిన మాగాణుల్లోకి గోదారమ్మను తీసుకొచ్చి సిరులు కురిపించి, ఉమ్మడి జిల్లా రైతుల నుంచి 'జల'జయధ్వానాలు అందుకున్నారు. ఈ నెల 21న కాళేశ్వరం వార్షికోత్సవం సందర్భంగా 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

నిజామాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక ఎత్తిపోతల పథకంగా పేరొందిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధారగా మారింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు 'కాళేశ్వరం' ఊపిరి పోసింది. ఆ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం, నిజాంసాగర్‌కు కాళేశ్వరం జలాల రాక ఒక అద్భుత ఘట్టంగా చరిత్రలో నిలిచి పోయింది. గోదావరి, మంజీరా నదులపై నిర్మించిన శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు వర్షాభావ పరిస్థితుల్లోనూ జల కళ సంతరించుకునేలా అప్పటి సీఎం కేసీఆర్ పటిష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేశారు. ఏటా జూన్, జులై, ఆగస్టు నెలల్లో వర్షాల కోసం ఎదురు చూసే ఆయకట్టు రైతులకు కాలంతో సంబంధం లేకుండా ప్రాజెక్టులో నీళ్లు నింపి భరోసానిచ్చారు. అద్భుతమైన ఇంజనీరింగ్ ప్రతిభకు అద్దం పట్టేలా ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంతో ఆయకట్టుకు భరోసా కల్పించారు. కాళేశ్వరం నీళ్లను గ్రావిటీ ద్వారా నిజాంసాగర్‌కు తరలించి ఏటా రెండు పంటలు పండించేలా చేశారు.

### పునరుజ్జీవం.. పునరుత్తేజం..

2017 ఆగస్టు 10వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి భూమిపూజ చేశారు. రూ.1,067 కోట్ల వ్యయంతో ఎస్సారెస్పీ నీళ్లను దిగువకు పారించే వరద కాలువలపై మూడు చోట్ల పంప్‌హౌస్‌లు నిర్మించి.. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా కిందకు నీళ్లు పారిన కాలువల్లోనే నీళ్లు మళ్లీ ఎదురెక్కేలా డిజైన్ చేసి నిర్మించడం ఇంజినీరింగ్ అద్భుతానికి నిదర్శనం. అనుకున్న విధంగానే రెండేళ్ల కాల వ్యవధిలోనే ఈ పనులు పూర్తయ్యాయి. వానాకాలంలో దిగువకు నీళ్లు వదిలే పరిస్థితి లేని ఎస్సారెస్పీలో పునరుజ్జీవ పథకంతో పునరుత్తేజం కలిగింది. కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్ నుంచి ఎత్తిపోసిన కాళేశ్వరం నీళ్లు జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్‌కు 4కిలో మీటర్ల దూరంలో ఉన్న నూకపల్లి వరకు చేరుకుంటున్నాయి. ఎస్సారెస్పీ వరకు ప్రతి 30 కిలో మీటర్ల దూరానికి ఒక పంప్‌హౌస్ నిర్మించడంతో మూడు చోట్ల నీళ్లు నిల్వ అవుతూ అక్కడి నుంచి వేగంగా ఎదురెక్కి ముందుకెళ్తుంటాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజరాజేశ్వర్‌రావు పేట వద్ద రెండో పంప్ హౌస్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచి నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వరద కాలువ నుంచి 0.100 కిలో మీటర్ పాయింట్ వద్ద మూడో పంప్ హౌస్‌ను నెలకొల్పారు. ఇక్కడి నుంచి నీళ్లను ఎత్తి పోచంపాడ్ ప్రాజెక్టులో పోస్తారు. ఒక్కో పంప్ హౌస్‌లో 11,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా ఎనిమిది మోటార్లు ఏర్పాటు చేశారు.



### జల ఘనతపై అక్కసు...

రైతుల శ్రేయస్సు కోసం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు కక్షగట్టింది. అడుగడుగునా బురద జల్లడమే పనిగా పెట్టుకున్నది. రైతుల కడుపు నింపే ప్రాజెక్టును నామరూపాల్లేకుండా చేసేందుకు కుయుక్తులు రచిస్తున్నప్పటికీ, ప్రకృతి రూపంలో ఎదురవుతున్న అవాంతరాలను అధిగమించేందుకు అదే ప్రాజెక్టును రేవంత్ సర్కారు ఆయువుపట్టుగా వాడుకుంటున్నది. 2024 వానాకాలం, యాసంగిలో నిజాంసాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. సింగూర్ జలాల విడుదలకు ఉమ్మడి మెదక్ జిల్లాలో అభ్యంతరాలు వ్యక్తం కాగా, తప్పనిసరి పరిస్థితుల్లో హల్దీవాగు ద్వారా కొండపోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం నీళ్లను నిజాంసాగర్‌కు మళ్లించాల్సి వచ్చింది. కేసీఆర్‌పై ఇష్టారీతిన ఆరోపణలు చేస్తూనే చివరకు ఆయన హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టునే వాడుకునే దుస్థితికి రేవంత్ సర్కారు దిగజారింది. ఓ వైపు అదే నోటితో కాళేశ్వరం ప్రాజెక్టును దూషిస్తూ, మరోవైపు అదే కాళేశ్వరం నీళ్లను వాడుకోవడం రేవంత్ సర్కారుకే చెల్లిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## వాహనాలు నడిపిన మైనర్లు

- కేసు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు
- సామాజిక సేవ చేయాలని జడ్జి తీర్పు

వినాయక్‌నగర్, జూన్ 18: లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 20మంది బాలురు సామాజిక సేవ చేయాలని నిజామాబాద్ బాలల మండలి చైర్ పర్సన్ ఖుష్బూ ఉపాధ్యాయ్(ప్రిన్స్ పల్ జూనియర్ సివిల్ జడ్జి) తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా.. పలువురు బాలలు పట్టుబడ్డారు. వారిపై క్రిమినల్ కకేసు నమోదు చేసి, నేర విచారణ అనంతరం బాలల న్యాయ మండలిలో రిపోర్టు ఫైల్ చేశారు. దీంతో బాలల మండలి చైర్‌పర్సన్ ఖుష్బూ ఉపాధ్యాయ్ బాలలను కోర్టుకు రప్పించి, 23కేసుల్లో వారిని వేర్వేరుగా విచారించారు. నేరం అంగీకరించడంతో ఒకొక్కరికి జూన్ 23 నుంచి 28వ తేదీ వరకు బాలల పరిశీలక గృహంలో సామాజిక సేవ చేయాలని తీర్పు వెలువరించారు. బాలలు తీర్పు పాటించకుంటే 15రోజుల పాటు బాలల పరిశీలక గృహ పర్యవేక్షుని నియంత్రణలో ఉండాలని పేర్కొన్నారు. ఒకేరోజు 23కేసుల్లో తీర్పు వెలువడడం జిల్లా న్యాయ చరిత్రలో ప్రథమమని సీనియర్ న్యాయవాదులు తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముట్టడి


మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట ధర్నాచేస్తున్న మున్సిపల్ కార్మికులు

కామారెడ్డి, జూన్ 19 :తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌ను గురువారం ముట్టడించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన కరువైందని, దీంతో కమిషనర్ చాంబర్‌ను ముట్టడించినట్లు తెలిపారు. నెలకు నాలుగు సెలవులు ఇవ్వాలని, ఆరోగ్యరీత్యా లేదా కుటుంబ సమస్యలతో ఉన్న కార్మికులకు బదిలీ అవకాశం కల్పించాలని, పాత కార్మికులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్, ఆటో డ్రైవర్లకు బీమా సౌకర్యం కల్పించాలని, వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని కోరారు. 60 ఏండ్లు నిండిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని, మాట తప్పారని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ రాజేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, యూనియన్ నాయకులు సంతోష్, దీవెన, శివరాజవ్వ, సావిత్రి, సులోచన, జ్యోతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం బారులు


తాడ్వాయి రైతువేదిక వద్దకు వచ్చిన రైతులు

లింగంపేట (తాడ్వాయి), జూన్19: సాగు పనుల్లో బిజీగా మారిన రైతులు యూరియా కోసం తిప్పలు పడాల్సి వస్తున్నది. రైతులకు సరిపడా యూరియా అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. అరకొర మాత్రమే సరఫరా అవుతున్నది. యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు గురువారం తాడ్వాయి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు తరలివచ్చారు. యూరియా కోసం బయటే బారులు తీరారు. తాడ్వాయికి 4500 బస్తాల యూరియా రావాల్సి ఉండగా 900 బస్తాలు రావడంతో నిలిపివేసినట్లు ఏవో నర్సింహులు తెలిపారు. శుక్రవారం 3600 బస్తాల యూరియా రానున్నదని చెప్పారు. ఇప్పటికే మండలంలోని కరడ్‌పల్లి, దేమి కలాన్‌లో దాదాపుగా ఆరు వేల బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు వివరించారు.

## న్యాయం చేయాలని ధర్నా


పోచారం కాలువ వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతుల కుటుంబసభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: మండలంలోని మల్లాయిపల్లి వద్ద ఉన్న పోచారం కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో మృతుల కుటుంబాలకు న్యాయంచేయాలని బాధితులు గురువారం ధర్నాకు దిగారు. పోచారం కాలువ వద్ద రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టి ఆందోళన చేపట్టారు. హైవే విస్తరణ పనులలో భాగంగా మల్లాయిపల్లి వద్ద ఉన్న పోచారం కాలువపై నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. కాలువను తవ్వడంతో పెద్ద గుంతగా మారింది. అక్కడ వీధి దీపాలు లేక రాత్రి సమయంలో చీకటిగా ఉండడం, సూచిక బోర్డులు పెద్దగా లేకపోవడంతో బుధవారం రాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. కారు నేరుగా కాలువలోకి దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఇంటి యజమానులు మృతి చెందడంతో తాము రోడ్డున పడ్డామని, న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు గురువారం ఆందోళనకు దిగారు. పోచారం కాలువ వద్ద డైవర్షన్ రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి బైఠాయించారు. సమాచారమందుకున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్ అక్కడకు చేరుకుని సముదాయించారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### కోటగిరి ఎంపీడీవో ఆఫీస్ ఎదుట పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

కోటగిరి, జూన్ 19: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతికేదని ప్రశ్నించారు. రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించడంలేదని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు కార్మికులను చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన కోటగిరి జీపీలో నిధులు కొరత ఎలా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లిస్తేనే విధులు చేపడతామని స్పష్టం చేశారు. కార్మికుల ఆందోళనపై స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీవో చందర్ నాలుగు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, జిల్లా నాయకులు నాగన్న, కోటగిరి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు


కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

## దళితుల భూముల్లో ట్రెంచింగ్

### అవి అటవీ భూములంటున్న అధికారులు


అధికారులతో మాట్లాడుతున్న రైతులు

మాచారెడ్డి, జూన్ 19 : కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్‌లో గురువారం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. యాభై సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు లాక్కునేందుకు యత్నిస్తున్నారని మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన దళితులు వాపోయారు. గ్రామానికి చెందిన 50 కుటుంబాలు సుమారు 70 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. అయితే, గురువారం అటవీశాఖ అధికారులు పోలీసు బందోబస్తుతో వచ్చి ఆయా భూముల్లో ఒడ్లను తొలగించి ట్రెంచ్ కొట్టించారు. ఈ నేపథ్యంలో అధికారులకు, దళితులకు మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. 50 ఏండ్లుగా తాము ఈ భూముల్లోనే సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు వచ్చి ఆ భూమి తమది కాదనడం సరికాదని వాపోయారు. ఇలా దాడులు చేసి తమ జీవనోపాధి దెబ్బ తీయొద్దని అధికారులను వేడుకున్నారు. అయితే, ఈ భూముల్లో 2016 నుంచి ప్లాంటేషన్ చేస్తుంటే ధ్వంసం చేసుకుంటూ వస్తున్నారని మాచారెడ్డి ఎఫ్ఆర్వో దివ్య తెలిపారు. ఆయా ఘటనల్లో కేసులు కూడా నమోదయ్యాయన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కామారెడ్డి ఎఫ్డీవో రామకృష్ణ, కామారెడ్డి ఎఫ్ఆర్వో రమేశ్, మాచారెడ్డి ఎస్సై అనిల్, అటవీ, పోలీసు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.





